## కథ

# “బంధం”

ఎల్. ఆర్. స్వామి

మాట్లాడుతూ, మాట్లాడుతూ అమ్మచేతినుంచి ఫోను జారిపోయింది. పక్కనే వున్న కుర్చీలోకి ఒరిగింది అమ్మ. స్పృహ కోల్పోయింది.

“అమ్మా.. కంగారు పుట్టుకొచ్చింది నాకు. చల్లటి నీళ్ళు తెచ్చి అమ్మ ముఖంమీద జల్లాను. అమ్మ కళ్ళు తెరవలేదు. “ఏమైంది మమ్మీ...ఏమైంది? అమ్మను కుదిపి కుదిపి అడిగాను.

మెల్లగా కళ్ళు తెరిచింది అమ్మ. కాని కనుపాపలు కదలలేదు. సముద్రపు ఒడ్డుపై పడవేసిన చేప పిల్లల్లా ఉన్నాయి అమ్మ కళ్ళు.

“ఏమైంది మమ్మీ...? ఫోను ఎవరిది?” ఆత్రుతగా మళ్ళీ అడిగాను.

“మీ నాన్న పోయారట. “అమ్మ పెదవులు మెల్లగా కదిలాయి. గొంతు పూర్తిగా పైకి రాలేదు. “ఓ...అంతేనా..” అని అనిపించింది నాకు బాధకాని దుఃఖం కాని కలగలేదు. రోడ్డు మీద వెళ్ళేటప్పుడు. ప్రమాదానికి గురై చనిపోయిన అపరిచితుడి శవం చూసినప్పుడు కలిగే స్పందనైనా కలగలేదు. రక్తసంబంధం కన్నా మనిషితో వుండే సాన్నిహిత్యమేగా హృదయ స్పందనకి కారణం!

గత పదిహేడేళ్ళుగా నేనే నాన్నని చూడలేదు. అమ్మకూడా నాన్న గురించి ఎప్పుడూ మాట్లాడలేదు. నగరంలోనే ఉంటాడు నాన్న!

“సిరీ...” మెల్లగా పిలిచింది అమ్మ. అమ్మగొంతు పూర్తిగా విచ్చుకోలేదు. కుర్చి పట్టుకొని మెల్లగా లేవడానికి ప్రయత్నించింది.

“లేస్తావెందుకు...? కాసేపు అలాగే కూర్చో...”

అమ్మ నా మాటలు పట్టించుకోలేదు. లేచి నిలబడి చీర సర్దుకొని ముందుకు కదిలింది.

“ఎక్కడికి మమ్మీ...?”

“ఎక్కడకేంటే... మీ నాన్నని చూడడానికి”

షాకు తిన్నాను నేను. పదిహేడేళ్ళుగా ఇంటికిరాని, ఒకసారైనా ఫోను చెయ్యని నాన్నని చూడడానికి...

ఏదో దెయ్యం పట్టిన దానిలా, కారుతాళం చెవులు తీసుకొని ఇంటి బయటికి పరిగెత్తింది అమ్మ-అమ్మతో పాటు నేను- స్పీడుగా రోడ్డు మీదకి దూసుకువెళ్ళింది కారు. రోడ్డు మలుపు తిరగగానే ఎదురుగా కనబడింది సముద్రం. మంచి పోటులో వుంది సాగరం. నిన్నటి సాయంత్రం తన ఒడ్డున సందడి చేసిన వారికోసం అలల శకటమెక్కి ముందుకు దూసుకుపోతోంది.

“జాగ్రత్త మమ్మీ...” బీచురోడ్డుకి తిరుగుతూ ఒక స్కూటరు వాడిని గుద్దేయబోయింది అమ్మ.

అమ్మ మాట్లాడలేదు; స్పీడు తగ్గించనూ లేదు. హఠాత్తుగా పెద్ద శబ్దంతో కారు ఆగింది.

దిగి చూసాను ఫుట్ పాత్తుని రాసుకుంటూ ఆగినట్టుంది కారు

అమ్మని వెనకసీటులో కూర్చోపెట్టి డ్రైవరు సీటు ఎక్కుతూ వుంటే కనబడింది ఆ రెస్టారెంటు. బీచుని ఆనుకొని వుంటే ఆ రెస్టారెంటు–

అప్పుడు నాకు పదేళ్ళు ఉండేవేమో... ఆ రెస్టారెంటులో సముద్రం చూస్తూ కూర్చోటం నాన్నకి ఇష్టం. నాన్నతో పాటు అక్కడే కూర్చొని “ఐస్‌క్రీం” చప్పరించటం నాకు ఇష్టం-అందువల్ల తరచూ అక్కడికి వెళ్ళే వాళ్ళం. కాని మమ్మి వచ్చేది కాదు. నాన్నతో పాటు బయటకు వెళ్ళాలంటే అమ్మకి చికాకే. నాన్నని కూడా బయటకు వెళ్ళవద్దని శాసించేది. కాని నాన్న ఆ మాట పట్టించుకునేవారు కాదు.

ఎక్కడకి వెళ్ళినా నాన్నని ఎక్కువగా ఆడపిల్లలు పలకరించి మాట్లాడేవారట. కొందరు ఆడవారైతే నాన్నగారితో, విరగబడి నవ్వుతూ కబురులాడేవారట. రాసుకు పూసుకు తిరిగేవారట. ఫోను నెంబరు ఇచ్చేవారట. అమ్మకి పట్టరానంత కోపం వచ్చేది. వారంతా, సంగీత విద్వాంసుడైన తన అభిమానులని చెప్పేవారు నాన్న. కాని అమ్మ నమ్మేది కాదు. ఏదో అనుమానం ఎప్పుడైనా అమ్మతో కలసి మేం బయటకు వెళ్ళివస్తే అమ్మ నాన్నల మధ్య పెద్ద గొడవ జరిగేది.

ఆ రోజు కూడా అదే జరిగింది. రాత్రి మెలుకువ వచ్చి చూసినప్పుడు అమ్మ పక్కన లేదు. హాలు నుంచి అమ్మ గొంతు వినబడింది. ఎప్పుడూ గట్టిగా మాట్లాడని నాన్న గట్టిగా మాట్లాడుతున్నారు. అమ్మ నాన్న గొడవ పడుతున్నారని అర్థమైంది. గట్టిగా కళ్ళు మూసుకుని పడుకున్నాను

అలవాటు ప్రకారం, మరునాడు నాకు “గుడ్‌మోర్నింగ్” చెప్పి లేపలేదు నాన్న. అమ్మ చిరుబురులాడుతూ కనబడింది. ఇంటిలో నాన్న కనబడలేదు. నాన్న ఎక్కడకి వెళ్ళాడని అడిగితే నన్ను కోపంగా కళ్ళు ఉరిమి చూసింది. ఆ రోజు ఆఫీసుకి వెళ్ళలేదు. అమ్మ రాత్రి చాలాసేపు ఇంటి తలుపులు తెరచి రోడ్డు చూస్తూ కూర్చుంది. నాన్న ఎప్పుడు వస్తాడని అడిగితే నన్ను కొట్టింది కూడా. ఆ రోజు నుంచి నాన్న ఇంటికి రాలేదు.

మూడో రోజునుంచి నాన్న ఇంటికి రాలేదు.

మూడో రోజు వచ్చింది అమ్మమ్మ.

“ఏమైందే...? వస్తానే అడిగింది అమ్మమ్మ” అతన్ని ఏమన్నావే.. ఏం మాట తుళ్ళావు?”

"కొత్తగా ఏం ఉంది చెప్పటానికి" అమ్మ విసుక్కుంది. ఎప్పుడూ ఉండేవేగా అభిమానులని ఆడపిల్లలతో...

"అతడు ఏం చేస్తాడే పాపం! వాళ్ళే అతన్ని చుట్టూ తిరుగుతూ వుంటే... గొప్ప సంగీత విద్వాంసుడు కదా "అవునవును గొప్ప విద్వాంసుడే.." "అమ్మ వెటకారంగా అంది" ఒక్కొక్క సారి ప్రాక్టీసుకని గొంతుని విప్పుతాడు బాబోయి...

"ఆ గొంతు వినేగా ప్రేమించి పెళ్ళి చేసుకున్నావు.. వెంటనే జవాబు చెప్పలేదు అమ్మ. ఒక నిమిషం ఆగి నాన్న 'డిగ్రీ' తీసుకునే ఫొటోచూస్తూ అంది. "ఏదో ఇంజినీరు ఉద్యోగం వెలగబెడుతున్నాడు కదా అని చేసుకున్నాను. బంగారంలాంటి ఆ ఉద్యోగం మానేసి ఇలా రాగాలు తీస్తూ 'సెటిల్' అవుతాడని అనుకున్నానేంటీ?

అమ్మమ్మ మాట్లాడలేదు

రెండేళ్ళు గడిచాయి. నాన్న ఒకసారైనా ఇంటికి రాలేదు "విన్నావా, అమ్మా.. నీ అల్లుడి నిర్వాకం? ఒకసారి ఇంటికి వచ్చినప్పుడు అమ్మమ్మతో అంది అమ్మ. "అల్లుడు శ్రీరామచంద్రుడని మెచ్చుకునే దానివి. తప్పంతా నాదే అని అన్నావు కదా. ఆ శ్రీరామచంద్రుడు ఎవర్తితోనో వుంటున్నాడట. ఉండక ఏం చేస్తాడే.. "అమ్మమ్మ అంది". ఏ మగాడైనా ఆడదాని నీడ లేకుండా ఉండలేడే... చిన్నప్పుడు తల్లి పెద్దవాడైనాక భార్య.. మగాడిని లాలించి ఆప్యాయత కురిపించి ముందుకు నడిపించేది ఆడదేనే."

అమ్మ మాట్లాడలేదు.

"ఎక్కడవున్నాడట..? "అమ్మమ్మ అడిగింది. "అప్పుడెప్పుడో ఊరు అవతల బంగ్లా కట్టించుకున్నాం కదా... అక్కడ."

రోడ్డు కూడలి చేరుకుంది కారు. ఎటు తిరగాలని అర్థం కాక అటూ ఇటూ చూసాను.

"రైటు తీసుకో..." అమ్మ అంది.

కారు తిప్పాను. రోడ్డు చాలా విశాలంగా ఉంది. ఇంత క్రితం అంటే నా చిన్నప్పుడు ఒకసారి ఆ దారిలో వెళ్ళినట్టు గుర్తు వచ్చింది. అప్పుడు ఈ రోడ్డు లేదు. కాల్దారి ఉండేది. అమ్మా నాన్నలతో రిక్షాలో వెళ్ళాను. అప్పుడు- గృహ ప్రవేశానికి-

ఆ రోజు కూడా అమ్మా నాన్నలు గట్టిగా పోట్లాడుకున్నారు. అడవిలో ఇల్లుకట్టి డబ్బు తగల పెట్టేసాడని నాన్నని తిట్టింది అమ్మ. విశాలమైన ఆ రెండెకరాల తోటలో వుండే ఆ బంగ్లాలో కూర్చుని ప్రశాంతంగా సాధన చెయ్య వచ్చుని చెప్పాడు నాన్న.

ఇప్పుడు నగరం ఆ బంగ్లాని అందుకుంది. ఒకప్పుడు ఇరువైపుల విస్తరించిన పొలాల గుండెల్లో బహుళ అంతస్తుల భవనాలు ఉన్నాయి. భవనాలన్నీ ఆసుపత్రులే! అవును మరి! నేటి సమాజానికి ఆహారానికన్నా ముఖ్యం మందులేగా!

మార్పు జీవలక్షణం. ఊరంటే నేనూ మారాను కదా! గౌను వేసుకుని అమ్మ చేతి వ్రేళ్ళు పట్టుకొని తిరిగిన నేను చదువు పూర్తి చేసి ఉద్యోగం చెయ్యడం లేదూ! అమ్మ చెయ్యపట్టుకొని రోడ్డు దాటించడం లేదూ! చిన్న చితక కచ్చేరీలు చేసిన నాన్న దేశ విదేశాలల్లో కచ్చేరీలు చేసి పేరు ప్రతిష్టలు పొందలేదూ!

"రైటు తీసుకో.." మళ్ళీ అంది అమ్మ.

రైటు తీసుకున్నాను. కాని ముందుకు వెళ్ళలేకపోయాను. రోడ్డు నిండా అడ్డదిడ్డంగా నిలిపిన కార్లు మరియు స్కూటర్లు-

రోడ్డు వారగా కారు ఆపి అమ్మ చెయ్యి పట్టుకొని ముందుకు నడిచాను.

ఇంటిగేటు తెరిచే వుంది. గేటు వద్దనుంచి ఇంటికి వెళ్ళే కాల్దారిపై 'గ్రానైటు' పరిచివుంది. దారికి ఇరువైపుల పెంచిన పూలతోటలోని మందార మొక్కలు వాడిన పూలమోములతో మాకు ఎదురైనాయి.

విశాలమైన ఇంటి ఆవరణలోనూ, ఇంటిలోనూ గుమిగూడి వున్నారు జనం.

జనం పక్కకి జరిగి దారి ఇచ్చారు. ముందుకు సాగి మాలు చేరుకున్నాం. అక్కడ నేలమీద ఉంది నాన్న శవం! శవం పక్కనే కూర్చుని వుంది ఆవిడ- కర్రి నలుపు- ఎత్తు పళ్ళు- నల్లచీర- దిట్టంగా కమ్మిన నల్లమబ్బు మధ్య కనబడే మెరుపు తీగల్లా మెడలో నగలు-

ఆవిడే... ఆవిడే నాన్నని మాకు దూరం చేసింది. నాకు పట్టరాని కోపం వచ్చింది. నాన్నని మచ్చిక చేసుకుని ఈ బంగ్లా నగలు డబ్బు అంతా అనుభవిస్తోంది.

హఠాత్తుగా నాకు ఆ ఆలోచన వచ్చింది. నాన్న పోయారు కదా, ఇదతా తనదేనని అంటూందేమో...

"కుదరదు. ఇవి ఆవిడకి చెంద కూడదు." నేను అనుకున్నాను.

నాన్న శవం చూసి వెక్కి వెక్కి ఏడ్చింది అమ్మ. ఇన్ని సంవత్సరాలుగా ఒకసారైనా ఫోనైనా చెయ్యని నాన్న శవం చేసి ఏడవటం ఎందుకని అర్థం కాలేదు.

"ఈవిడ ఎవ్వరూ...? అంత ఏడుస్తోంది? గుంపులో గుసగుసలు.

"అతని పెళ్ళామట".

"మహాలక్ష్మిలా ఉంది, ఈ వయసుస్సులో కూడా..." "రూపు బాగుండి ప్రయోజనం ఏంటీ? పరమ గయ్యాళిదట. మొగుడిని రాచి రంపాన పెట్టేదట. అందువల్లేగా ఇతడు ఈ కర్రిదానితో..."

ఆ మాటలు అమ్మ వింటుందేమోననే భయం వేసింది నాకు. అమ్మని మెల్లగా నడిపించుకొని లోపల గదిలోకి వెళ్ళాను.

పెద్ద ఇల్లు- ఇంటి ఆవరణలోనే రెండెకరాల తోట- నాన్న సంపాదించిన డబ్బు, నగలు-ఇవన్ని ఈవిడకి సొంతమవుతుందేమో...?



సృజన విశాఖ ఆధ్వర్యంలో జరిగిన 'మీ డైరీలో ఒకరోజు' పుస్తకావిష్కరణ సభలో (కుడి నుండి ఎడమ) టి.సాయి ప్రకాష్, రచయిత ఎన్.వి.ఎస్., డా॥మోపిదేవి విజయగోపాల్, కొంపెల్ల కామేశ్వరరావు, శ్రీ జ్యోత్స్న, గుండాని జోగారావు, జి.తిరుపతిరావు

ఇంటి యజమాని విత్తనం వేసి పెంచిన చెట్టులోని పండ్లు ఎక్కడనుంచో వచ్చిన అల్లరి చిలుక ఆరగిస్తూ ఉంటే, చూస్తూ ఊరుకుంటామా! ఆస్తి ఆవిడ సొంతం చేసుకోవడానికి వీలు లేదు. గట్టిగా చెప్పాలి. "పాపా..." ఆ పిలుపు విని ఉలిక్కిపడి చూసాను. ఎదురుగా నిలబడి వున్నారు ఆవిడ.

"అంతా అతడు అనుకున్నట్టుగానే చేసాను. శవాన్ని "మెడికల్ కాలేజి వారికి అప్పగించమని అనేవారు. వారు వచ్చి తీసుకొని వెళ్ళారు."

నేను మాట్లాడలేదు. అమ్మ ముఖం వైపు చూసాను. శూన్యంలోకి చూస్తూ కూర్చునివుంది అమ్మ.

"పాపా...నీతో కాసేపు మాట్లాడాలి. ఆవిడ అన్నారు

"నువ్వు నాతో మాట్లాడేదేంటీ? పరుషంగా వచ్చాయి నా మాటలు.

"సిరీ... అంతవరకు పెదవి విప్పని అమ్మ గట్టిగా అంది "ఏమిటా మాటలు. పెద్దావిడ.."

"పెద్దావిడా..? "నేను వెటకారంగా నవ్వి అన్నాను. పెద్దావిడ.. నీ భర్తని నీకు... మా నాన్నని నాకు దూరం చేసి". "నేను ఎవ్వరిని ఎవ్వరికి దూరం చెయ్యలేదు, తల్లీ... "మీరే దూరం చేసుకున్నారు."

"చివరికి ఈ మాటలు ఒకటి.. చేసిందంతా చేసి.." "నేనేం చెయ్యలేదు తల్లీ. మీ నాన్నని నేను ఎన్నడూ కోరుకోలేదు."

"మరే.."

"అతనిలోని సంగీతాన్ని కోరుకున్నాను, ఆరాధించాను మీ నుంచి వేరుపడ్డాక అతని మానసిక స్థితి చూసి జాలిపడ్డాను. అతనిలోని కళ ప్రపంచానికి తెలియకుండానే రాలిపోతుందేమోనని భయపడ్డాను. అందుకే అతన్ని చేరదీసాను. అతనికి మనోధైర్యమిచ్చాను. అతని ప్రతిభ లోకానికి చాటి చెప్పాను. అంతేకాని... ఆవిడ కళ్ళు నిండాయి. "అంతేకాని, మీ నాన్నతో నాకు వేరే ఏ సంబంధమూ లేదు తల్లీ. ఈ వృద్ధకన్య మాటలు నమ్ము తల్లీ..."

నాకు బాధ కలిగింది. ఆవిడ ముఖంవైపు సూటిగా చూడలేకపోయాను. గోడమీదకి దృష్టి మళ్ళించాను. గోడనిండా నాన్న ఫొటోలే! కచ్చేరీలు ఇచ్చే ఫొటోలు! ఆవిడ ఫొటో ఎక్కడా కనబడలేదు. గది తలుపు ఎదురుగా అమ్మది పెద్ద ఫొటో ఉంది. పక్కనే నా చిన్నప్పటి ఫొటో!

"నా పని అయిపోయింది" ఆవిడ అన్నారు." ఇక నేను బయలుదేరుతానే." అప్పుడు చూసాను ఆవిడని. ఆవిడ మెడబోడిగా ఉంది- బోడి చేతులు

"నాకు ఇప్పుడు హాయిగా సంతృప్తిగా ఉంది. అతనికి సంబంధించినదంతా వదిలి వెళ్తున్నాను. ఇన్ని సంవత్సరాలు అతని గురించే బ్రతికాను. అతని సంతోషం గురించే బ్రతికాను. అతనికోసం అతడు వేసుకోమని చెప్పిన నగలు వేసుకున్నాను; కట్టమన్న చీరలు కట్టాను. ఈ ఇంటిలోనే ఉండమని పట్టుపట్టాడు కనుక ఇక్కడే వున్నాను. ఒక గొప్ప కళాకారుని బ్రతికించటం కోసం నాకు తెలుసు తల్లీ. నాకు ఇవేం అక్కర లేదు కూడా. ఆవిడ ముందుకు సాగారు. నా కళ్ళు నిండాయి. ఆవిడని వెనుకకి పిలవాలని అనిపించిది. కాని పెదవి పెగలలేదు.

ముందుకు నడిచి చుట్టూ వుండే చీకటిలో కరిగిపోయింది ఆవిడ!

# చిరునామా

## ఎన్ అరుణ

కొండముందు
నిలబడ్డప్పుడు తెలిసింది
నా ఎత్తేమిటో!
జలపాతంలో
శ్రుతి కలిపినప్పుడు తెలిసింది
సాహసమంటే ఏమిటో!
అడవి పుస్తకంలో
ఎన్నిపూల కావ్యఖండికలో!
రంగుల కలయికలో తెలిసింది
మట్టి అంటే ఏమిటో!
ఆకాశంలో వెళ్తుంటే
పైనశూన్యం
కింద మబ్బుకుప్పలధాన్యం
రెండు ఆకాశాల మధ్య
గుండె ఒక్కటే సత్యం.
పంచభూతాల ఇంద్రియాలూ
కలిసి నర్తించేటప్పుడు తెలిసింది
అనుభూతికి మూలమేమిటో!
ఎప్పుడూ ఓ జ్ఞాపకం
వెంటాడుతుంది
వచ్చేటప్పుడు తెచ్చిందికాదు
పొయ్యేటప్పుడు ఎలావుంటుందో తెలియదు.
క్రమంగా రాజుకున్న ఉదయాలు
భగ్గుమన్న మధ్యాహ్నాలు
చీకట్లోకి ఇంకిపొయ్యే
సంధ్యా ప్రవాహాల్లో తెలిసింది
కదిలే కాలమంటే ఏమిటో!
గాలిలో వెతికితే
నా ఉనికి మారుతుంటుంది.
నాలోకి వెళ్తే తెలిసింది
నా చిరునామా ఏమిటో!